క్లుప్తంగా

విద్యార్థిని ప్రతిభ


ఎస్‌కె.రహేలా

ఇల్లెందురూరల్: కామన్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎస్‌కె.రహేలా ఎంఎస్సీ మ్యాథ్స్‌లో రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకు సాధించింది. ఈ మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య, అధ్యాపకులు బుధవారం ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహేలా అధ్యాపకుల సూచనతో సాధన చేసి రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించడం కళాశాలకు గర్వకారణమన్నారు.

బహుమతులు అందజేత


విద్యార్థులతో కమిషనర్ శ్రీకాంత్

ఇల్లెందు: మున్సిపాలిటీలో 100 రోజుల ప్రణాళిక ముగింపు కార్యక్రమం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, డ్రాయింగ్ కాంపిటీషన్ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. బుధవారం ఇల్లెందు మున్సిపాలిటీ మీటింగ్‌హాల్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, మేనేజర్ అంకుషావలీ, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

టేకులపల్లి: ఈ నెల 13 వరకు నిర్వహించే మెగా లోక్‌అదాలత్‌లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని టేకులపల్లి, బోడు ఎస్సైలు అలకుంట రాజేందర్, పొడిశెట్టి శ్రీకాంత్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ స్టేషన్ల పరిధిలోని రోడ్డు ప్రమాదాలు, కొట్టుకున్న కేసులు, చీటింగ్, వివాహ సంబంధ కేసులు, చిన్న చిన్న దొంగతనం తదితర కేసులకు రాజీ పడాలనుకునే వారు అదాలత్‌లకు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు పోలీసు స్టేషన్లలో సంప్రదించాలని తెలిపారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి


వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై

సుజాతనగర్: వాహనదారులు తప్పకుండా నిబంధనలు పాటించాలని ఎస్సై ఎం.రమాదేవి అన్నారు. ఖమ్మం, కొత్తగూడెం ప్రధాన రహదారిపై సుజాతనగర్‌లో బుధవారం విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనపత్రాలను పరిశీలించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇతర పత్రాలను వెంట ఉంచుకొని, హెల్మెట్లు తప్పక ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. పెండింగ్‌లో చలాన్లు ఎప్పటికప్పుడు చెల్లించాలన్నారు.

రాత పరీక్ష నిర్వహణపై సమావేశం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో 2025–26లో ప్రారంభించబోయే ఉచిత వృత్తి శిక్షణ తరగతులు, గతేడాదిలో నేర్చుకున్న అభ్యర్థులతో ఉచిత వృత్తి శిక్షణ తరగతుల రాత పరీక్ష నిర్వహణపై బుధవారం త్రీ ఇంక్‌లైన్ క్లబ్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా సేవ అధ్యక్షురాలు జి.మధురవాణి, జీఎం ఎం.షాలేంరాజు మాట్లాడారు. డీజీఎం (పర్సనల్) మోహన్‌రావు, పద్మజా కోటిరెడ్డి, లేడీస్ క్లబ్‌సెక్రటరీ సునిత, మురళి, అనిత, సేవా సభ్యులు ఉన్నారు.

కార్మికులను బదిలీ చేయొద్దు

ఇల్లెందు: ఇల్లెందు జేకే ఓసీ కార్మికులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేయొద్దని, ఈ రీజియన్‌లోనే వారిని కొనసాగించాలని టీబీజీకేఎస్ డిమాండ్ చేసింది. బుధవారం టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్.రంగనాథ్, ఉపాధ్యక్షుడు జాఫర్‌హుస్సేన్ మాట్లాడుతూ... లాభాలు తెచ్చిపెట్టడంలో కీలక పాత్ర పోషించిన కార్మికులను బొగ్గు ఉత్పత్తి లేదని మరో ప్రాంతానికి బదిలీ చేసేందుకు యాజమాన్యం నిర్ణయం తీసుకోవటం తగదన్నారు. జేకే ఓసీ–5 గనిలో పని చేసే వారిని ఈ రీజియన్‌లోనే కొనసాగించేలన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

ఇల్లెందు: ఆర్టీసీలో విద్యుత్ బస్‌ల విధానంలో మార్పులు చేయాలని, ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని, ఈ నెల 12న నిర్వహించే సేవ్ ఆర్టీసీ డే నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌ఏ నబీ, మండల కార్యదర్శి కృష్ణ, ఇల్లెందు డిపో ఎస్‌డబ్ల్యూఎఫ్ సెక్రటరీ ఉపేంద్రా చారీలు కోరారు. ఈ మేరకు బుధవారం డిపో ఎదుట ఆందోళన కరపత్రాలు ఆవిష్కరించారు.

ప్రయాణం.. నరకప్రాయం..

అధ్వానంగా రాష్ట్రీయ రహదారి

- వినోభానగర్– కొమ్ముగూడెం వరకు గుంతలమయం
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాహనాలు నడపాల్సిన పరిస్థితి



గుంతలతో అధ్వానంగా మారిన రోడ్డు

జూలూరుపాడు: తల్లాడ–కొత్తగూడెం రాష్ట్రీయ రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ మేరకు జిల్లా సరిహద్దు మండలంలోని వినోభానగర్ నుంచి కొమ్ముగూడెం వరకు గుంతలుపడి రోడ్డు అధ్వానంగా మారింది. వినోభానగర్, జూలూరుపాడు, సాయిరాంతండా, దండుమిట్టతండా, పడమట నర్సాపురం, మాచినేనిపేటతండా, కొమ్ముగూడెం గ్రామాల్లోని తారు రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మరింతగా రోడ్డు దెబ్బతిని అస్తవ్యస్తంగా మారింది. అడుగుకో లోతైన గుంత ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. రాత్రి సమయాల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాహనాలను నడపాల్సి ఉంటుంది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం బారినపడాల్సిందే. ఇప్పటికే పలు ప్రమాదాలు జరిగిన ఘటనలు కూడా ఉన్నాయి.

పూర్తిగా దెబ్బతిని..

సుమారు 14 కిలోమీటర్ల మేర రహదారి పూర్తిగా దెబ్బతినడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు, ద్వి చక్రవాహనాదారులు ఏమరపాటుగా ఉంటే కన్ను మూసి కన్ను తెరిచేలోపు ప్రమాదం జరుగుతుంది. మృత్యుకుహరాలుగా మారుతున్నప్పటికీ గుంతలను పూడ్చకపోవడం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీళ్లు నిలిచి ఎక్కడ గుంత ఉందో తెలియక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా తల్లాడ–కొత్తగూడెం వైపు ట్రాఫిక్‌ను మళ్లించారు. దీంతో వాహనాల రద్దీ పెరగడంతో రోడ్డంతా అధ్వానంగా ఉండటంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడాల్సి వచ్చింది. ఇటీవల పడమటనర్సాపురం గ్రామ సమీపంలో టమాట లోడ్‌తో వెళ్లే బొలెరో వాహనం బోల్తా పడింది. ఇలాంటి ప్రమాదాలు తరుచు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీశాఖ అధికారులు స్పందించి రహదారి మరమ్మత్తులు తక్షణమే చేపట్టి పూర్తి చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



జిల్లా సరిహద్దు నుంచి వినోభానగర్ వరకు రహదారి పూర్తిగా దెబ్బతినడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నప్పటికీ రోడ్డు మరమ్మతులు చేపట్టకపోవడంతో గుంతలు ఏర్పడ్డాయి. ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. మరమ్మతులు చేపట్టాలి.

– ముదిగొండ వెంకటేష్, వినోభానగర్

ఎక్కడ పడతామోనని భయంగా..



వాహనాలు నడపాలంటే భయం భయంగా ఉంది. రోడ్డంతా గుంతలమయంగా ఉండటంతో ఎక్కడ పడిపోతానో అనిపిస్తుంది. పొలానికి వెళ్లి రావాలంటే అవస్తపడాల్సి వస్తుంది. రోడ్డు దెబ్బతినడంతో ఏ గుంతలో బైక్ పడిపోతుందోనని ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తుంది.

– గుండెపిన్ని గోపాల్‌రావు, జూలూరుపాడు

రోడ్డంతా దెబ్బతిన్నది



ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. రోడ్డంతా దెబ్బతిని పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఏ మాత్రం నిర్లక్ష్యంగా బైక్ నడిపితే ప్రమాదం బారినపడాల్సిందే. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.

– సాయిన్ని హరీష్, జూలూరుపాడు

క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం


ఇల్లెందు: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం కృష్ణయ్య


కొత్తగూడెంఅర్బన్: క్రీడాకారులతో జీఎం షాలేంరాజు

కొత్తగూడెంఅర్బన్: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దారుఢ్యాన్ని పెంచుతాయని కొత్తగూడెం జీఎం ఎం.షాలేంరాజు అన్నారు. కొత్తగూడెం ఏరియాలో 2025–26 వార్షిక సంవత్సరానికి వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్‌లో భాగంగా కొత్తగూడెం ఏరియా రుద్రంపూర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్స్‌లో బుధవారం క్రీడలు కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ మల్లికార్జునరావు, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, ఎస్‌ఓటు జీఎం జీవీ.కోటిరెడ్డి, ఏజీఎం (సివిల్) సిహెచ్.రామకృష్ణ, డీజీఎం (పర్సనల్) జీవీ.మోహన్‌రావు, డీవైపీఎం జి.హరీష్, అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ ఎంసి పోస్నేట్, యూనియన్ ప్రతినిధులు, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ భూక్యా భీముడు, జనరల్ కెప్టెన్ బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సంస్థకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలి

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా వార్షిక క్రీడా పోటీలను జీఎం వీసం కృష్ణయ్య బుధవారం ప్రారంభించారు. 24 ఏరియా సింగరేణి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన క్రీడా పోటీల్లో క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ అధికారి జాకీర్ హుస్సేన్, డీజీఎం పర్సనల్ తుకారం, ఏరియా సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, అధికారులు దిలీప్‌కుమార్, శ్యాంప్రసాద్, అధికారుల సంఘం నుంచి నాగేశ్వరరావు, గుర్తింపు సంఘం నుంచి నజీర్ అహ్మద్, వెంకటేశ్వర్లు, సీనియర్ పర్సనల్ అధికారి అజయ్, క్రీడా సమన్వయకర్త వెంకటేశ్వర్లు, శ్రీకాంత్ ఉన్నారు.

‘గురుకులం’లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు

పాల్వంచరూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదు నుంచి తొమ్మిదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి విద్యార్థులు ఈ నెల13 వరకు దరఖాస్తులు చేసుకోవాలని గురుకుల విద్యాసంస్థల సమన్వయకర్త ఎం.అన్వేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంట్రెన్స్ టెస్ట్ రాసిన హాల్‌టికెట్, ర్యాంక్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

మరుగుదొడ్లు ప్రారంభం


ప్రారంభిస్తున్న కమిషనర్ సుజాత

పాల్వంచ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొత్తూరు గోపయ్య జ్ఞాపకార్థం కుమారుడు చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ కొత్తూరు సంజీవరావు మరుగుదొడ్ల పునర్నిర్మించడంతో బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కె.సుజాత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మంగమ్మ, సీనియర్ ఉపాధ్యాయులు ఎన్.శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిగా పాండురంగారావు

జూలూరుపాడు: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) అధ్యక్షుడు, పర్సన్ ఇన్‌చార్జిగా కొమ్మినేని పాండురంగారావు బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం సొసైటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న చీమలపాటి భిక్షం, డైరెక్టర్ అల్లాడి రజనీలు పంట రుణం వాయిదా మీరినందుకు అనర్హత వేటు పడింది. దీంతో డైరెక్టర్ కొమ్మినేని పాండురంగారావును సొసైటీ అధ్యక్షుడు, పర్సన్ ఇన్‌చార్జిగా జిల్లా సహకార అధికారి(డీసీఓ) శ్రీనివాస్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా పర్సన్ ఇన్‌చార్జి మెంబర్లుగా యల్లంకి సత్యనారాయణ, చాపలమడుగు రామ్మూర్తి, కల్లోజి రజనీ, భూక్యా జవహర్ లాల్, లకావత్ హేమ్లా, కల్యాణపు నరేష్, శీరంశెట్టి రామారావు, పాపిన్ని వెంకయ్య, మనుబోలు తిరువెంగళరాజు, రెడ్డిబోయిన రాములను నియమించారు. సొసైటీ సెక్రటరీ రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి..

జూలూరుపాడు: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో బుధవారం సీపీఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగించాలన్నారు. అదేవిధంగా డీవైఎఫ్ఐ మాజీ మండల కార్యదర్శి పద్దం శ్రీనివాసరావు వర్ధంతి నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రేపాక శ్రీనివాసరావు, కొండపల్లి శ్రీధర్, మండల కార్యదర్శి యాసా నరేష్, బానోత్ మధు, గడిదేశి కనకరత్నం, గార్లపాటి వెంకటి, బోడా అభిమిత్ర, పద్దం సుగుణ, ఈసం నరసింహారావు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన


నిలిపివేసిన రాకపోకలు


సెర్ప్, ఈజీఎస్ కార్యాలయం ఆవరణలో..


రోడ్డుపై నిలిచిన వరద నీరు

జూలూరుపాడు/టేకులపల్లి: వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుని జూలూరుపాడు, టేకులపల్లి మండలాల్లో బుధవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కురిసింది. ఈ మేరకు రోడ్లన్నీ వరదనీరు చేరింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. టేకులపల్లి సెర్ప్, ఈజీఎస్ కార్యాలయాల ఆవరణ, వాగొడ్డుతండా పాఠశాల ఆవరణలు చెరువుల్లా మారాయి ప్రెగళ్లపాడు వెళ్లు దారిలో శ్మశానవాటిక సమీపంలో ప్రధాన రహదారి వద్ద బుంగ ఏర్పడి రోడ్డు కోతకు గురై రాకపోకలు నిలిచిపోయాయి తూర్పుగూడెం వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండంతో ఇక్కడ కూడా రాకపోకలు నిలిచిపోయాయి. రోళ్లపాడు మార్గంలో, పుణ్యపు వాగు, రాంపురం వద్ద, బేతంపూడి వద్ద రాకపోకలకు అంతరాయం కలిగింది. అదేవిధంగా జూలూరుపాడులో పత్తి పంట పూత, పిందె, కాయ దశలో భారీ వర్షం కురవడంతో నష్టం ఏర్పడింది.

సంక్షేమ పథకాలు అర్హులకు అందించాలి


జూలూరుపాడు: మాట్లాడుతున్న ఐటీడీఏ జేడీఎం హరికృష్ణ


టేకులపల్లి: మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్లేశ్వరి


పాల్వంచరూరల్: శిక్షణ పొందిన ఆది కర్మయోగి అభియాన్ సభ్యులతో ఎంపీడీఓ..

జూలూరుపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టి అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా అర్హులైన గిరిజన కుటుంబాలకు అందించడానికి మండలస్థాయి కమిటీ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ జేడీఎం, ఆది కర్మయోగి అభియాన్ మండల స్పెషల్ ఆఫీసర్ హరికృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఆది కర్మయోగి అభియాన్ పథకం ప్రతిస్పందనాత్మక పాలనా కార్యక్రమంలో భాగంగా రెండు రోజులు పాటు జరిగే గ్రామస్థాయి అధికారుల శిక్షణా కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆయా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు వనరులను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్, ఎంపీడీఓ తాళ్లూరి రవి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం ఎస్కే.మీరాసాహెబ్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ బి.తార, హెచ్‌ఈఓ రవి, హెచ్‌వీ రాధిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, హెచ్‌ఎంలు ఉషారాణి, జగదాంబ, అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయడమే లక్ష్యం

టేకులపల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో గిరిజనులందరికీ సంపూర్ణంగా అమలు చేయడమే లక్ష్యమని నోడల్ ఆఫీసర్, ఎంపీడీవో బైరు మల్లేశ్వరి అన్నారు. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రారంభించిన ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమం ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు రైతువేదికలో రెండు రోజుల శిక్షణా శిబిరం ముగిసింది. జిల్లా ట్రైనర్ రూప, బ్లాక్‌లెవెల్ మాస్టర్ ట్రైనర్లు జి.వెంకట్రావు, వజ్జా పార్వతి, డి.రామ్‌చంద్రసింగ్, పి.నాగేశ్వరరావు, కె.అనురాధ, ఎన్‌జీవో భూక్యలాలు, మూడు హుస్సేన్ పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: రెండు రోజులపాటు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఆది కర్మయోగి అభియాన్ సభ్యులు శిక్షణ ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ఏపీఓ పారంధ్ల రంగా, ఏపీఎం మీరాబీ, ప్రకాశ్‌రావు, మాధవిలత తదితరులు పాల్గొన్నారు.

నిధులు కార్మికుల సంక్షేమానికే వాడాలి



మాట్లాడుతున్న బ్రహ్మచారి

టేకులపల్లి: వెల్ఫేర్ బోర్డు నిధులు బిల్డింగ్ నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కొలగాని బ్రహ్మచారి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సీఐటీయూ కార్యాలయంలో బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ మండల మహాసభ జినక బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మచారితో పాటు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, సీఐటీయూ డివిజన్ కన్వీనర్ ఎస్ ఏ.నబి మాట్లాడుతూ.. బిల్డింగ్ వర్కర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం సీఐటీయూ అనేక సంవత్సరాలుగా పోరాటాలు నిర్వహించిందన్నారు. సంక్షేమ బోర్డులో ప్రైవేట్ బీమా కంపెనీలను అనుమతించవద్దని డిమాండ్ చేశారు. బిల్డింగ్ వర్కర్లకు ఐదు లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పించాలని, సంక్షేమ బోర్డు ఎత్తివేయాలనే ఆలోచన మానుకోవాలన్నారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. మండల గౌరవాధ్యక్షుడిగా జినక బాబు, అధ్యక్షుడిగా బానోత్ లచ్చిరాం, కార్యదర్శిగా బి.సురేష్, కోశాధికారి ఎం.శోభన్, ఉపాధ్యక్షులు నామ, రమేష్, సహాయ కార్యదర్శులు మాడె రామారావు, బి.వీరులతో పాటు కమిటీ సభ్యులుగా సతీష్, గణేష్, రాజు, నాన్ చారి, సతీష్, సేరి, వెంకటేష్, రమేష్, మోహన్, రవి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

తుది జాబితా విడుదల


సుజాతనగర్: జాబితా విడుదల చేస్తున్న అధికారులు


జూలూరుపాడులో..

సుజాతనగర్: జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల తుదిజాబితాను అధికారులు బుధవారం విడుదల చేశారు. మండలంలోని మొత్తం ఐదు ఎంపీటీసీ స్థానాల పరిధిలో మహిళలు 7,311 మంది, పురుషులు 7,109 మంది ఇతరులు ఒక్కరు మొత్తం 14,421 మంది ఓటర్లు ఉన్నారు. గతంలో మండలంలో మొత్తం 8 ఎంపీటీసీ స్థానాలు ఉండగా సుజాతనగర్, సుజాతనగర్–2, కోమటిపల్లి, నర్సింహసాగర్ నాలుగు ఎంపీటీసీ స్థానాలు కార్పొరేషన్‌లో విలీనం కావడంతో ఐదు స్థానాలు కొనసాగనున్నాయి. నర్సింహసాగర్ కార్పొరేషన్‌లో విలీనం కావడంతో దీని పరిధిలో ఉన్న కోయగూడెం, జామ్లాతండా, బేతంపూడిలను కలుపుకొని స్టేషన్ బేతంపూడి పేరుతో కొత్త ఎంపీటీసీ స్థానం రూపుదిద్దుకుంది. మొత్తం 5 ఎంపీటీసీ స్థానాల పరిధిలో 28 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

జూలూరుపాడు: స్థానిక సంస్థల నిర్వహణలో భాగంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తుది ఓటర్ల జాబితాను ఎంపీడీఓ తాళ్లూరి రవి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 10 ఎంపీటీసీలు, ఒక జెడ్పీటీసీ స్థానానికి సంబంధించిన ఓటర్ల జాబితా, 61 పోలింగ్ స్టేషన్ల జాబితాను ఎంపీడీఓ కార్యాలయంలోని నోటీస్ బోర్డుపై ప్రదర్శించారు. మండలంలో మొత్తం 27,985 మంది ఓటర్లు ఉన్నారని, పురుషులు 13,681 మంది, మహిళా ఓటర్లు 14,303 మంది కాగా, ట్రాన్స్‌జెండర్ ఒకరు ఉన్నారన్నారు. సీనియర్ అసిస్టెంట్ పార్వతి, సిబ్బంది ఉన్నారు.

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం..


కొత్తగూడెంఅర్బన్: గ్రంథాలయంలో నివాళి..


ఇల్లెందు: నివాళులర్పిస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: భూమి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరనారి చాకలి ఐలమ్మ జీవితం నేటి తరాలకు ఆదర్శనీయమని గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు అన్నారు. ఈ మేరకు ఆమె వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక గ్రంథాలయం ఆవరణలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథపాలకురాలు మనీ మృదుల, ఈశ్వర్, మురళి, ఉపేంద్ర, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ఇల్లెందు: భూమి భుక్తి విముక్తి కోసం వెట్టి చాకిరి నిర్మూలన కోసం సాగిన తెలంగాణ రైతాంగ పోరాటంలో అగ్రభాగాన పోరాడిన యోధురాలు చాకలి ఐలమ్మ అని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మండల కార్యదర్శి ఆలేటి సంధ్య తెలిపారు. ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు సోమలక్ష్మీ, వెంకటమ్మ, యాకమ్మ, చంద్రమ్మ, దుర్గ తదితరులు ఉన్నారు. పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో నివాళులర్పించిన వారిలో అధ్యక్షుడు డానియేల్, సుదర్శన్ కోరీ, జాఫర్, వెంకటేశ్వర్లు, సాతెల్ల గిరి, కంచర్ల చంద్రశేఖర్, దాసు, సతీష్, రాజేందర్, రామకృష్ణ ఉన్నారు.

ఇల్లెందురూరల్: చాకలి ఐలమ్మ చేసిన పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిన్నప్పయ్య అన్నారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: మండలంలోని వినోభానగర్‌లో తెలంగాణ గ్రామీణ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు సిరికొండ శుభాకర్, సిరికొండ నరసింహారావు, తిరుమలరావు, ముదిగొండ రమేష్, తంబారపు శ్రీను, పెద్ద నరసింహారావు, వేణు, వెంకన్న, రేగళ్ల రాంబాబు, కృష్ణ, గొల్లపూడి భద్రమ్మ, రమ, నాగమణి, ఉష, అజిత ఉన్నారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక శేషగిరిభవన్‌లో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


ఇల్లెందురూరల్: నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు


జూలూరుపాడు: వినోభానగర్‌లో..


సూపర్‌బజార్(కొత్తగూడెం): సీపీఐ ఆధ్వర్యంలో..